సౌమ్యనాథుని సన్నిధిలో కలెక్టర్



స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

నందలూరు : జిల్లాలో చారిత్రాత్మక, సుప్రసిద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయాన్ని బుధవారం ఉదయం అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం పూజారులు కలెక్టర్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శంకర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

పెనగలూరు : చక్రంపేట హైస్కూల్‌లో బుధవారం ముమ్మరంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు హెచ్‌ఎం గోపాలకృష్ణ బహుమతులు అందజేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి వేడుకను ఆలయ కమిటీ ప్రతినిధులు వైభవంగా నిర్వహించారు. తొలుత వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల ఉత్సవ మూర్తులను అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు పూజలు జరిపారు.

ఓ మోస్తరు వర్షం

పెనగలూరు : మండలంలో మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురవడంతో 77 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైంది. దీంతో పలు వీధుల్లోకి వర్షపునీరు నిలవడంతో చెరువును తలపించాయి.

ఓబులవారిపల్లె : మండలంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం తెల్లవారు జాము నుంచి చిరుజల్లులు కురుస్తుండగా.. బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. మండలంలో 25.5 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది.

టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించండి

లక్కిరెడ్డిపల్లి : టోల్ ఫ్రీ నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద టోల్‌ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితులలో 108, 100, 112, 104, 101,1906, 1930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఆడపిల్లల రక్షణ, బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గోడపత్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

కూలుతున్న కోట గోడలు

- శిథిలావస్థలకు మట్లిరాజుల కోట
- పట్టించుకోని పురావస్తుశాఖ



సిద్దవటం మట్లిరాజుల కోట ముఖ ద్వారం వద్ద కూలిపోయిన గోడ

సిద్దవటం : ఎందరో రాజులు, నవాబులు, బ్రిటీష్ వారు పరిపాలించిన శతాబ్దాల చరిత్ర కలిగిన సిద్దవటం మట్లిరాజుల కోట గోడలు ఒక్కొక్కటి కూలిపోతున్నాయి. కోట ముఖద్వారం వద్ద ప్రధాన గోడ రెండు చోట్ల కూలిపోగా రెండవ మండపం తూర్పు వైపు ఉన్న గోడ కూలిపోయింది. పురావస్తు శాఖ అధికారులు వచ్చి కూలిపోయిన కోట గోడలను చూసి నివేదికలను పంపిస్తున్నామని చెపుతున్నప్పటికీ కోట గోడలు మాత్రం కూలిపోతూనే ఉన్నాయి. వాటిని ఎప్పుడు పునర్నిర్మిస్తారో చెప్పలేని అయోమయ స్థితిలో అధికారులున్నారు. సిద్దవటం కోటలో ఇద్దరు ఎంటీఎస్ ఉద్యోగులు, ఒక ఎన్‌ఎంఆర్ ఉద్యోగి, ఒక పారిశుధ్య కార్మికురాలు విధులు నిర్వర్తిస్తున్నారు. కోటలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయడం మినహా పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడంలో వారు విఫలమవుతున్నారు.

తిను బండారాలను అడ్డుకుంటున్నారు

సిద్దవటం మట్లిరాజుల కోటకు వచ్చే సందర్శకులు, పర్యాటకులు తెచ్చుకుంటున్న తినుబండారాలను పురావస్తు శాఖ సిబ్బంది అడ్డుకుంటున్నారని పర్యాటకులు వాపోతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నిత్యం కోటను సందర్శిస్తుంటారు. కుటుంబసభ్యులతో వచ్చే పర్యాటకులు తమ వెంట తెచ్చుకుంటున్న అన్నపానీయాలు, వాటర్ బాటిళ్లను పురావస్తు శాఖ సిబ్బంది కోట ముఖ ద్వారం వద్దనే అడ్డుకుంటుండటంతో పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోటను సందర్శించే పర్యాటకులకు వసతులు కల్పించాల్సింది పోయి పర్యాటకులను అడ్డుకుంటుండటంతో సిద్దవటం కోటకు బదులు మిగతా ప్రాంతాకు వెళ్లే అవకాశాలు లేకపోలేదని స్థానికులు చెబుతున్నారు.

శిథిలావస్థలో మహల్‌లు

సిద్దవటం కోట ఆవరణలో రాజు ఆభరణాలు, కైంకర్యాలు, వజ్ర వైడుర్యాలు, రాజు సామగ్రిని భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన రాజమహల్, రాణి ఆభరణాలను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన రాణీ మహల్‌లు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సిద్దవటం కోటకు పోలిన కట్టడాలు మిగతా రాష్ట్రాల్లో ఉన్నట్లయితే ఆయా కట్టడాలను పునర్ నిర్మించేవారని, కోటలోని కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నా పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోలేదని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. కోటలో నంది విగ్రహం బాగుండేదని, ఆ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారని ఇలా ఒక్కొక్కటిగా పురావస్తు సంపద కాల గర్భంలో కలిసిపోతున్నా సంబంధిత అధికారులకు వాటి మరమ్మతు పనులకు ఎప్పుడు శ్రీకారం చుడతారోనని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.



కోటను సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు

అభివృద్ధిని విస్మరించారు



సిద్దవటం మట్లి రాజులకోట కూలిన గోడ కట్టడాలు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు వాటిని పునర్నిర్మించలేదు. కోట అభివృద్ధి కోసం పురావస్తు శాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. కోట సిబ్బంది ఎంతసేపు గ్రామంలో ఎవరైనా కొత్తగా ఇండ్ల నిర్మాణాలు చేపడితే వారికి కోటకు 200 మీటర్లలోపు నూతన నిర్మాణాలు చేపట్టవద్దని వారికి నోటీసులు ఇస్తున్నారే తప్ప కూలిపోయిన కోట గోడలను పునరుద్ధరణకు అడుగులు వేయడంలేదు.

– సయ్యద్ అబ్దుల్ రసూల్, సిద్దవటం

కనీస సౌకర్యాలు లేవు



పర్యాటకులు సిద్దవటం కోటను చూసేందుకు సూదుర ప్రాంతాల నుంచి పర్యాటకులు, సందర్శకులు వస్తుంటారు. వారు వెంట తెచ్చుకున్న అన్న పానీయాలను కుంటుంబీకులతో కలసి కోటలో తినాలనుకుంటే అక్కడ సిబ్బంది కోట ముఖద్వారం వద్దనే అడ్డుకుంటున్నారు. పర్యాటకులకు వెంట తెచ్చుకున్న అన్నం తినేందుకు సౌకర్యాలు లేక తిరిగి వారు ఇంటికి తీసుకొని వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇలా చేస్తు కోటకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది.

– గువ్వల శివశంకర్, పర్యాటకుడు, కడప

నివేదికలు పంపాం

సిద్దవటంలోని మట్లిరాజుల కోటలో మూడు చోట్ల గోడలు కూలిపోయాయని, వాటి నిర్మాణం కోసం మెటీరియల్‌ను సపోర్టు చేశాం. మ్యాన్ పవర్‌కు టెండర్ల అప్రూవల్‌కు రీజినల్ డైరెక్టర్‌కు నివేదికలు పంపాం. అక్కడి నుంచి అమోదం లభించగానే కోట గోడ కట్టడాల నిర్మాణాలను చేపడతాం.

– బాలక్రిష్ణారెడ్డి, జిల్లా పురావస్తుశాఖ అధికారి, వైఎస్‌ఆర్ జిల్లా

నేటి చిన్నారులే భావిభారత పౌరులు

రాయచోటి టౌన్ : నేటి చిన్నారులే భావిభారత పౌరులని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యం సాధించడం కోసం జవహర్ లాల్ నెహ్రూ ఎంతో కృషి చేశారన్నారు. అలానే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ మొదటి ప్రధానిగా ఆయన ఎనలేని సేవ చేశారన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని సూచించారు. చిన్నారులకు మనం ఇవ్వగలిగిన గొప్ప ఆస్తి చదువు ఒక్కటేనని తెలియజేశారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, విద్యార్థులకు పౌష్టికాహారం అందించామని తెలియజేశారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలు – పరిష్కార మార్గాలు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ సుబ్రమణ్యం తన సొంత నిధులతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోండి

రాజంపేట టౌన్ : రాజంపేట డివిజన్‌లో అనేక సంక్షేమ హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం రాజంపేటలో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. చిన్నపాటి వర్షం కురిసినా అనేక హాస్టళ్లలోని భవనాలు ఉరుస్తున్నాయని కలెక్టర్‌కు తెలియచేశారు. రైల్వేకోడూరులోని ఎర్రచందనం పార్కు వద్ద ఉన్న ఎస్సీ హాస్టల్, రాజంపేటలోని వత్తలూరు రోడ్డులో ఉన్న ఎస్సీ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకోగా, బీసీ హాస్టల్‌లోని గదుల శ్లాబు పెచ్చులూడుతున్నాయని అలాగే బాత్‌రూములు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన 30 సెంట్ల స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని తెలిపారు. స్పందించి కలెక్టర్ గిరిజన పాఠశాలకు కేటాయించిన స్థలానికి హద్దులు ఏర్పరచాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, నాయకులు సూర్యవర్ధన్, వినోద్‌కుమార్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులు

రాజంపేట : కార్తిక మాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులు నడిపించనున్నట్లు డిపో మేనేజరు రమణయ్య విలేకరులకు తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 15న రాజంపేట నుంచి అరుణాచలంకు బస్సు సర్వీసును ప్రయాణికులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ బస్సు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 17 నుంచి 24 వరకు రాజంపేట నుంచి శ్రీశైలంకు రాత్రి 9 గంటలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చార్జిరూ.1250గా నిర్ణయించామన్నారు. పంచరామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షరామము, సామర్లకోట, కోటప్పకొండ, త్రిపురాంతకం వెళ్లదలిచినవారు అధికారులనుసంప్రదించాలన్నారు. అలాగే కార్తిక మాసంలో భక్తులు పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వీలుగా ఆర్టీసీ ప్రత్యేకబస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రజాగొంతుకగా పని చేస్తా

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొరముట్ల శ్రీనివాసులు
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు, కార్యకర్తలు



ఆకేపాటి, కొరముట్లను సత్కరిస్తున్న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాగొంతుకగా పని చేస్తానని బుధవారం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకం అయిన కొరముట్లను అభినందించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు – ఏడు నెలల కాలంలో రాష్ట్రంలో హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు ఘోరంగా పెరిగిపోయాయన్నారు. చిన్నారులకు, మహిళలకు కూటమి ప్రభుత్వ పాలనలో భద్రత లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వారియర్స్‌పై చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండను ఆయన ఖండించారు. రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. 14 ఏళ్ల చిన్నారిపై కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేంటని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న వైఖరిని తప్పుబట్టారు. ఒకటి, రెండు అరెస్టులతో వైఎస్సార్‌సీపీని అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. టీడీపీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో చేసిన పోస్టులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలంటూ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజల నెత్తిపై రూ.6వేల కోట్ల పైచిలుకు భారాన్ని వేశారంటూ మండిపడ్డారు. పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఏదో ఒక అంశం తెరపైకి తెచ్చి రాజకీయం చేస్తున్నారని, ప్రజలు చంద్రబాబు కుయుక్తులను పసిగట్టలేరని భావించడం ఆయన అవివేకమన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు పథకాలు, హామీలు అందించి ప్రజల మనస్సులు గెలుచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ముస్తాక్, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, జెడ్పీటీసీ రత్నమ్మ, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరి, భరత్‌కుమార్‌రెడ్డి, మహేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి

నాయకులు, కార్యకర్తలు అందరం కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందామని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ కోడూరు నుంచి కొరముట్ల శ్రీనివాసులుకు రాష్ట్ర స్థాయిలో పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించడం సంతోషమన్నారు. కోడూరు నియోజకవర్గంలో విజయం సాధించే విధంగా కలిసికట్టుగా ప్రజల వెంట ఉండి వారి సమస్యలపై పోరాడాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని తెలియజేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని నాయకులకు సూచించారు.

అభినందనలు తెలిపిన నాయకులు

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు బుధవారం నియోజకవర్గంలోని నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రైల్వేకోడూరులోని ఆపార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి కొరముట్ల శ్రీనివాసులను సత్కరించారు. అభినందలు తెలిపిన వారిలో ఓబులవారిపల్లె వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సాయికిషోర్ రెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు జైపాల్‌రెడ్డి, ఎల్.గంగరాజు, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్‌రాజు తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

రామాపురం : గ్రామంలో ఇటీవల జరిగిన రీ సర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని హసనాపురంలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. హసనాపురం గ్రామంలో 7749–17 ఎకరాలు రీ సర్వే చేయడం జరిగిందని, ఈ రీ సర్వే వల్ల గ్రామ ప్రజలకు ఎలాంటి భూ సమస్యలు ఉన్న గ్రామ సభ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యను పరిష్కరించడానికి రెవిన్యూ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఐఓఎస్ గురువురెడ్డి, ఐఓఎఫ్ ప్రసాద్, మండల సర్వేయర్ మధుస్మోహన్‌రెడ్డి, ఆర్‌ఐ సమ్మద్‌ఖాన్, వీఆర్‌ఓ రమణ, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు పల్లవి



పల్లవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సుండుపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లవి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న తెలిపారు. జాతీయస్థాయి పోటీలు డిసెంబర్ నెలలో పంజాబ్‌లోని లూథియానాలో జరుగుతాయన్నారు. విద్యార్థినిని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమణ, పాఠశాల పీడీలు రవీంద్రనాథ్ రాజు, రాధారాణి అభినందించారు.

'ఎంఎస్ రాయుడు మృతి తీరనిలోటు'



ఎంఎస్ రాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, కమ్యూనిస్టు నేతలు

రాజంపేట రూరల్ : సీపీఐ సీనియర్ నాయకులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు మృతి రాజంపేటలో కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. స్థానిక కళాంజలి కళ్యాణ మండపంలో బుధవారం ఎంఎస్ రాయుడు సంస్మరణ సభను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణ దేవరా అధ్యక్షతన నిర్వహించారు. పాల్గొన్న ఆకేపాటి ఎంఎస్ రాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎంఎస్ రాయుడు సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే ఆకేపాటి వెంట కౌన్సిలర్ పోలా వెంకటరమణారెడ్డి, నాయకులు జీవీ కృష్ణారావు, పి.విశ్వనాథరెడ్డి, దండు గోపి, ఎ.సౌమిత్రి, డి.పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, జి.కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు ఎంఎస్ రాయుడు ఆశయ సాధనకోసం అందరం కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు కొనియాడారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన ఉండాలి




రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖ అధికారిణి నాగమణి

లక్కిరెడ్డిపల్లి : మామిడిపూత, పిందె సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కుర్నూతల, పందిళ్లపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మామిడి పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

ఎమ్మెల్యే ఆకేపాటికి ఆహ్వానం

రాజంపేట రూరల్ : ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తిక పౌర్ణమి వేడుకలకు విచ్చేయవల్సిందిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని ఆ సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. మండల పరిధిలోని ఆకేపాడు ఎస్టేట్‌కు బుధవారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు విచ్చేశారు. ఈ నెల 15న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో శ్రీలక్ష్మీ సత్యనారాయణస్వామి వ్రతము నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అదే విధంగా శివపార్వతుల కల్యాణం జరుపనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో బొగ్గరపు రాజేష్‌గుప్తా, సనిసెట్టి నరేంద్ర, పచ్చిపులుసు కల్యాణ్, వల్లంకొండ శివ బాలాజీ, మదళ్ళపల్లి భరత్‌కుమార్, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహా భక్తుడు అంబరీషుడు



గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట రూరల్ : నిరంతరం భగవంతుని సేవలో ఉండే భక్తుడు భగవంతుని మనస్సు చూరగొంటారని తెలియజేసిన మహా భక్తుడు అంబరీషుడని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలియజేశారు. మండల పరిధిలోని మందరం రాచపల్లి గ్రామంలోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక వారోత్సవాలలో బుధవారం ఆయన అంబరీషోపాఖ్యానం అనే అంశంపైన ధార్మికోపన్యాసం చేశారు. హరి భక్తుడైన అంబరీషుడు బంగారమును, మట్టిపెళ్లను రెండింటిని సమానంగా చూసి సర్వకర్మలను హరిపరం చేసి భూమిని పరిపాలించాడని తెలియజేశారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

కడప అర్బన్: తప్పిపోయిన బాలికను పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారించగా వారు తిరుపతిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం వారిని పిలిపించి తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు మందలించడంతో వెళ్లినట్లు వారు తెలిపారు.

లక్ష దీపోత్సవానికి తరలిరండి



శ్రీ సిద్దేశ్వరస్వామి, కూటాలమ్మల దేవాలయం

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దబలిజపల్లి, మలక్కగారిపల్లి రహదారిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి, కూటాలమ్మ తల్లి దేవాలయాల వద్ద ఈనెల 15వ తేదీ శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ సభ్యులు తెలిపారు. ఉదయాన్నే పూజారులు స్వాములవారిని ప్రత్యేక అలంకరణ చేసి పంచామృతాభిషేకాలు సమర్పించి హోమం జరుపనునట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించి సాయంత్రం లక్ష దీపోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలందరూ స్వామివారిని దర్శించుకొని లక్షదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి

సిద్దవటం : రబీ సీజన్‌లో సాగు చేసుకున్న పంటలకు సంబంధించి ఈనెల 17వ తేదీ నుంచి ఇ-పంట నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ప్రతి రైతు తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె, పెద్దపల్లె రైతు సేవా కేంద్రాలలో రికార్డులను పరిశీలించారు. సూక్ష్మ సేద్యం, డ్రిప్ ఇరిగేషన్ దరఖాస్తులు, పరికరాల సరఫరా వంటి అంశాలపై రైతులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన నేకనాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధి పొందాలంటే అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఎన్‌పీసీఐ మ్యాపింగ్, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులకు రసాయనిక ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. వరి(వానపాముల రకం) పొలాన్ని సందర్శించి, యూరియాతో పాటు 25 కిలోలు పొటాష్‌ను తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు సందీప్‌సింహ యాదవ్, ప్రేమ సందీప్, సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, రైతులు పి.ఎల్లారెడ్డి, శ్రీనయ్య, పి.సుబ్బారెడ్డి, రామచంద్ర, జె.ఎల్లారెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన పట్టాభూమిని ఇప్పించండి



ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిలో సీతమ్మ

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో 448–1 సర్వే నెంబర్‌లో 2.06 ఎకరాల భూమిని అదే పంచాయతీలో పత్తిరాజుగారిపల్లికి చెందిన రాఘవరాజు సీతమ్మ భర్త కృష్ణంరాజు పేరుతో 2023 సంవత్సరంలో ప్రభుత్వ భూమిని రెవెన్యూ వారు పట్టా ఇవ్వడమే కాక సబ్ డివిజన్ కూడా చేశారని సీతమ్మ తెలిపారు. ఆమె బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన పేరుతో ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిలోకి చుట్టుపక్కల రైతులు రానివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ శ్రావణి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని ఆమె వాపోయారు. నాకు ప్రభుత్వం ఇచ్చిన భూమి తప్పా మరొకటి లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, తనపైకి దౌర్జన్యంగా వస్తున్న రైతులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.